
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 7
ఆదివారం 26 జనవరి 2025



400 మందికి 'ఉత్తమ' అవార్డులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 400 మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. వారికి ఆదివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో అవార్డులు, ప్రశంసాపత్రాలను కలెక్టర్ రంజిత్ బాషా అందజేయనున్నారు. ఉద్యోగులతో పాటు వివిధ సేవా రంగాల్లో గుర్తింపుపొందిన వారికి కూడా ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు జిల్లా రైతు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు రాష్ట్రంలో ఏడుగురు అభ్యుదయ రైతులను కుటుంబ సమేతంగా ప్రత్యేక అతిథులుగా పంపాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆహ్వానం ఇచ్చిందని ఏపీఎంఐపీ కర్నూలు జిల్లా పీడీ ఉమాదేవి తెలిపారు. శనివారం ఏపీఎంఐపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యాన శాఖ రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని క్రిష్ణగిరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, పల్నాడు, కడప, తిరుపతి జిల్లాల్లో సూక్ష్మ సేద్యం కింద ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఏడుగురు అభ్యుదయ రైతులను సతీసమేతంగా ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానం వచ్చిందని అన్నారు. ఈ ఉత్తర్వులు ఏపీఎంఐపీ కార్యాలయానికి శనివారం వచ్చాయని చెప్పారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కోవెలకుంట్ల గ్రామానికి చెందిన రైతు యు. చంద్రశేఖర్ ఢిల్లీ వెళ్లనున్నారని తెలిపారు.



చంద్రశేఖర్ రెడ్డి

నేడు రిపబ్లిక్ డే

- వేడుకలకు ముస్తాబైన పోలీసు పరేడ్ గ్రౌండ్
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ 76వ గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. జిల్లా వ్యాప్తంగా రిపబ్లిక్ డే సంబరాలు ఆదివారం ఘనంగా జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు కలెక్టర్ రంజిత్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అదేవిధంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కవాతులో సాయుధ దళాలు పాల్గొంటాయి. ఈ సందర్భంగా పలు స్టాళ్ల ఏర్పాటు, ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, దేశభక్తి గీతాలకు విద్యార్థుల నృత్య ప్రదర్శన, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ వేడుకలకు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కీలక అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

సమగ్ర శిక్ష నిర్వహించిన టెండర్లలో గోల్ మాల్ జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలకు 51 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి సమగ్ర శిక్ష టెండర్లను పిలిచింది. అయితే అందులో ఐదింటికి ఒక రూల్, ఆరో టెండర్‌కు మరో రూల్ పాటించారన్న విమర్శలు ఉన్నాయి. ఆరో టెండర్‌కు మాత్రమే సర్దుబాటు నిబంధన అమలు చేసి అడ్డదారిలో అనర్హులకు అప్పగించిందని టెండర్‌లో పాల్గొన్న వ్యక్తులు ఆరోపిస్తున్నారు. ఒక టెండరును ఒకరికి కాకుండా మరో ఇద్దరికి కలిపి ఇవ్వడం.. అది కూడా కడప జిల్లా వాసులకు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. జాయింట్ కలెక్టర్ సమక్షంలో జరిగిన టెండర్లలోనే అవకతవకలు జరగడం దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంపై టెండర్‌లో పాల్గొన్న కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడం గమనార్హం.



సమగ్రత ఏదీ..?

- సమగ్ర శిక్ష టెండర్లలో గోల్‌మాల్...!
- ఐదు టెండర్లకు ఒకలా.. ఆరో టెండర్‌కు మరోలా
- సర్దుబాటు పేరుతో అనర్హులకు అప్పగింత
- ఒకే టెండర్‌ను ముగ్గురికి పంచడంపై విమర్శలు
- పైగా కడప వాసులకు ఇవ్వడంపై అనుమానాలు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు

నంద్యాల జనవరి 25, (ఆంధ్రజ్యోతి):

గత నెల 21న టెండర్ నోటిఫికేషన్

కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసేందుకు గత నెల 21వ తేదీన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో అర్హులైన వారు డిపాజిట్ చెల్లించి టెండర్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత గత నెల 31వ తేదీన సదరు కమిటీ చైర్మన్ జాయింట్ కలెక్టర్ కావడంతో ఆయన చాంబర్‌లో టెండర్లను తెరిచారు. సర్వశిక్ష పరిధిలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు సంబంధించి పిలిచిన ఆరు టెండర్లలో ఎంపిక కమిటీ ఐదు టెండర్లు తక్కువ ధరకు కోడ్ చేసిన వారికే అప్పగించింది. ఇందులో ఎక్కడా ఎలాంటి సమస్య లేదు. అయితే ఆరో టెండరు విషయంలో మాత్రమే సదరు కమిటీ సర్దుబాటు నిబంధన అమలు చేసింది. తక్కువ ధరకు కోడ్ చేసిన వ్యక్తికే ఇవ్వకుండా అనర్హులైన మరో ఇద్దరికి కలిపి అప్పగించింది. అది కూడా టెండర్ వేసిన తొమ్మిది మందిలో తక్కువ ధరకు కోడ్ చేసిన వారి జాబితాలో ఉన్న మొదటి, రెండు, మూడు స్థానాల్లో ఉన్న వ్యక్తులకు కాకుండా నాలుగో వ్యక్తికి, ఆ తర్వాత ఐదు, ఆరు స్థానాల్లో ఉన్న వ్యక్తికి కాకుండా ఏడో వ్యక్తికి కలిపి సదరు టెండర్‌ను సర్దుబాటు పేరుతో కేటాయించింది. అసలైన టెండరుదారుడితోపాటు మరో ఇద్దరిని కలిపి ఆయా స్కూళ్లను వారికి పంచి టెండర్ నియామక పత్రాలను అందజేయడం పలు విమర్శలకు తావిస్తోంది. చివరకు తక్కువ ధర కోడ్ చేసిన వ్యక్తి తనకు మాత్రమే ఇవ్వాల్సిన టెండరును మరో ఇద్దరికి కలిపి ఇవ్వడంతో షాక్ గురయ్యాడు.

టెండర్ ముగ్గురికి ఇచ్చినా..

సదరు కమిటీ సర్దుబాటు పేరుతో ఒకే టెండర్‌ను ముగ్గురికి ఇవ్వడం కూడా చర్చగా మారింది. తక్కువ ధరకు కోడ్ చేసిన కర్నూలుకు చెందిన శ్రీనివాస ట్రేడర్స్‌కు కాకుండా మరో ఇద్దరికి స్కూళ్లను విభజించి ఇచ్చింది. విషయం తెలుసుకున్న మిగిలిన ఆరుగురు టెండర్‌దారులు అభ్యంతరం తెలిపినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో వీరందరూ కలిసి న్యాయం కోసం కోర్టుకు వెళ్లారు. టెండరు ముగ్గురికి వచ్చినప్పటికీ తక్కువ ధరకు కోడ్ చేసిన వ్యక్తి మాత్రమే ఇప్పటికీ ఆయా స్కూళ్లకు ప్రొవిజన్స్ సరఫరా చేశారని సమాచారం. మిగిలిన ఇద్దరు భవిష్యత్తులో ఎలాంటి సమస్య వస్తుందోనని ఆందోళనతో ఇప్పటి వరకు సరఫరా చేయలేదని ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.



కడప జిల్లా వాసులకు ఇవ్వడంలో ఆంతర్యమేంటో..?

ప్రొవిజన్స్ టెండర్‌కు కోడ్ చేసిన టెండరుదారుల వివరాలు ఇలా...

శ్రీ శ్రీనివాస ట్రేడర్స్	- రూ. 2,71,731.04
మదీనా ట్రేడర్స్	- రూ. 2,81,845.80
ఎంఎస్ ట్రేడర్స్	- రూ. 2,84,604.04
శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్	- రూ. 2,97,970.70
హనుమాన్ ట్రేడర్స్	- రూ. 3,05,408.00
నందన ట్రేడర్స్	- రూ. 3,10,952.57
కేవీఆర్	- రూ. 3,18,234.61
లక్ష్మీప్రసాద్	- రూ. 3,70,716.00
కేవీసీఎస్	- రూ. 3,90,442.00

టెండర్ ఎంపిక కమిటీ సభ్యులుగా ఎస్ఎస్ఏ పీవో, జీసీడీవో, డీఈవో సభ్యులుగా, జాయింట్ కలెక్టర్ చైర్మన్ ఉంటారు. ఈ కమిటీ టెండర్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వారికి కాకుండా కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, పులివెందులకు చెందిన కేవీఆర్ ఆగ్రోస్, శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ వారికి సర్దుబాటు నిబంధన పేరుతో అప్పగించడం పలు విమర్శలకు తావిస్తోంది. కడప జిల్లాకు చెందిన ఆ ఇద్దరు కూడా అక్కడి ప్రజాప్రతినిధులకు సమీప బంధువులు కావడంతోనే కేటాయించారని తెలుస్తోంది. దీనికితోడు కమిటీలోని కొందరు సభ్యులు మామూళ్లు కూడా తీసుకొని ఒకే టెండర్‌ను ముగ్గురికి సర్దుబాటు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని అర్హులైన వారికి న్యాయం జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఇటీవల ఎంపిక చేసిన టెండర్లు.. వాటి వివరాలు..

టెండర్లలో రకాలు	వాటి ధరలు	డిపాజిట్ అమౌంట్
ప్రొవిజన్స్	రూ. 6,43,84,760	రూ.12,87,695
వెజిటెబుల్స్	రూ. 1,75,38,840	రూ.3,50,777
ఫ్రూట్స్	రూ. 96,49,200	రూ. 1,92,984
ఎగ్స్	రూ. 96,49,200	రూ. 1,92,984
చికెన్	రూ. 75,68,000	రూ.1,51,360
ఇతర వస్తువులు	రూ. 9,41,400	రూ.18,840

'బెస్ట్' అవార్డు అందుకున్న కలెక్టర్



బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందుకున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. బాపట్ల కలెక్టర్‌గా 2024లో ఓటర్ల జాబితా తయారీ, సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తదితర అంశాల్లో సమర్థవంతంగా పని చేసినందుకు ఎన్నికల కమిషన్ పి.రంజిత్ బాషాకు అవార్డును అందజేసింది.

ఓటు నమోదు చేసుకోండి

- అర్హత గల యువత ముందుకు రావాలి
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య అన్నారు. శనివారం పట్టణంలోని సునయన ఆడిటోరియంలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2011 జనవరి 25న మొదటిసారి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని క్యాబినెట్‌లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రతిపాదించారని గుర్తు చేశారు. త్వరలోనే దేశంలో ఒక బిలియన్ ఓటర్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఓటు నమోదు 65 శాతం ఉందని, రాష్ట్రంలో 80 శాతం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు న మోదు కావాలన్నారు. అనంతరం వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అదేవిధంగా సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతుల ఓటర్లను శాలు వ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, డీఆర్వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఉపాధి కల్పన అధికారి దీప్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, జి. పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల, సీఎస్‌సీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, ఎస్టీబీసీ ఉస్మానియా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు మరో అవకాశం

ఇన్‌చార్జి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కర్నూలు క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి వివిధ కారణాలతో ఇప్పటి వరకు గైర్హాజరైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీన హాజరు కావాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శనివారం తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్లు, క్రిమిలేయర్, కుల ధృవీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, ఇతర స్టేజ్-1, స్టేజ్-2లో అప్‌లోడు చేసుకున్న మేరకు సరైన ధృవపత్రాలు, ఒరిజినల్స్ తీసుకుని రావాలన్నారు. గత నెల 30నుంచి కొనసాగుతున్న ఈ దేహదారుఢ్య పరీక్షలు ఈ నెల 28న ముగియనున్నాయని ఆయన తెలిపారు.

హంద్రీ నీవా ఎస్ఈగా వరప్రసాద్



కర్నూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈ ఎంఎల్ఎన్ వరప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎస్ఈ సురేశ్‌బాబు ద్వారా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పాణ్యం ఈఈగా పని చేస్తున్న వరప్రసాద్ ఈ నెల 17న ఎస్ఈగా పదోన్నది ఇచ్చి హంద్రీనీవా కర్నూలు సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేశారు. హంద్రీ నీవా ప్రాజెక్టు ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఈలు శివప్రసాద్, మల్లికార్జునరెడ్డి తదితరులు ఆయనను కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఇన్‌చార్జి ఎస్ఈగా పని చేసిన సురేశ్‌బాబు అవుకు ఈఈగా కొనసాగుతారు.

ప్రణాళికాబద్ధంగా క్యూలైన్లు

శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 25(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం టికెట్ల కౌంటర్లను మరో చోటికి మార్చి భక్తులు వెళ్లే క్యూలైన్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉండే భక్తులకు అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు నిరంతరం అందజేయాలన్నారు.

బీపీఎస్ గడువు పెంపు

దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పట్టణ ప్రణాళికా విభాగంలో నూతన సంస్కరణలను తీసుకువచ్చింది. ఎప్పుడో 2022 సంవత్సరంలో బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణను మళ్లీ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది. దరఖాస్తుదారులు ఈ స్కీమ్‌లో పనులు చేయించుకోవాలంటే మార్చి 31 వరకు గడువు పొడిగిస్తూ గత నెల డిసెంబరులో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో ఇప్పటి వరకు అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ కోసం 262 దరఖాస్తులు వచ్చాయి. అయితే అందులో 33 దరఖాస్తులను 2022 సంవత్సరంలోనే అనుమతులు ఇచ్చారు. మిగిలిన 202 దరఖాస్తులకు వివిధ రకాల పత్రాలు ఇవ్వాలని చూపుతూ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. అదేవిధంగా 14 దరఖాస్తుదారులకు డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. ఈ ప్రక్రియలను వేగవంతం చేసేందుకు అధి కారులు సమాయత్తం అయ్యారు. అందులో భాగంగా ప్లానింగ్ సెక్ర టరీలతో పెండింగ్ దరఖాస్తులకుదారులకు ఫోన్లు చేయిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పెంపు..

లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కూడా గడువు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31 లోపల అక్రమ లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పట్టణ ప్రణాళికా అధికారులు దీని కోసం ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేశారు. ఇప్పటి వరకు 619 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 279 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చారు. 100 దరఖాస్తులకు వివిధ రకాల పత్రాలు పెండింగ్ ఉన్నాయంటూ అధికారులు షార్ట్‌ఫాల్స్‌లో ఉంచారు. 26 మంది దరఖాస్తుదారులు డబ్బులు చెల్లించాలని పరిశీలనలో ఉంది. మిగిలిన 77 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి. పెండింగ్ దరఖాస్తుదారులకు ప్లానింగ్ సెక్రటరీలో సంప్రదిస్తున్నారు.



కర్నూలు నగర పాలక సంస్థ

ఎరుకుల వర్గానికి వీసీ పదవి కేటాయించాలి

కర్నూలు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో ఎరుకుల సామాజిక వర్గానికి ఉపకులపతి పదవి కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో సరికొత్త ఒరవడితో ప్రభుత్వం నూతన ఉపకుల పతుల నియామకం చేపడుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కీలక పదవులైనటు వంటి ఉపకులపతి పదవీ ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామరాజు, ఉపేంద్ర, దత్తు, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసపు విక్రయాలు నిషేధం

కర్నూలు న్యూసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో ఎలాంటి జంతువులను వధించరాదని నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డా.కే. విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. కబేళాలు, అన్ని రకాల మాంసపు విక్రయ దుకాణదారులు దుకాణాలను మూసివేయాలని, హోటళ్లు, రెస్టారెంట్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ మాంసపు పదార్థాలు విక్రయించరాదన్నారు. నగర వ్యాప్తంగా తనిఖీలు జరుగుతాయని, ఎవరైనా అమ్మకాలు చేస్తూ పట్టుబడిన, నిషేధాజ్ఞలు ఉల్లంఘించి అమ్మకాలు చేసినట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి దుకాణ ట్రేడ్ లైసెన్సు రద్దు చేసి భారీ జరిమానా విధిస్తామని అన్నారు. వ్యాపారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాలకల్లులో చెత్త సేకరణకు ఏర్పాట్లు

సి. బెళగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకల్లు గ్రామంలో చెత్త సేకరణకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. గ్రామంలో చెత్తను రోడ్లపైన ఇళ్ల మధ్యనే పారవేస్తుండడంతో రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు తమ దృషికి తీసుకరావడంతో చెత్త సేకరణ కేంద్రానికి స్థలాన్ని శనివారం పరిశీలించామని ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో వెంట ఈవోఆర్డీ ఈశ్వర స్వామి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి గ్రామ సర్పంచ్ మాదక్క గ్రామ పెద్దలు ఉన్నారు.

డ్రైవర్ల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలి


ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో ప్రస్తావించాలని సీఐటీయూ నాయకులు నాగారాజు డిమాండ్ చేశారు. శనివారం నగరంలో ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన మోటార్ యాక్ట్ సవరణ బిల్లులో భాగంగా అధిక చలానాలు, జరిమానాలు, జైలు శిక్షలు భారీగా అమలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోటార్ యాక్ట్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో అమోదం పొందడం ఆ బిల్లును అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఆదేశించడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎంపీ నాగరాజు సమస్యలన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో నాయకులు రాధాకృష్ణ, కే, ప్రభాకర్, మోహమూద్, హుస్సేన్ వలీ తదితరులు పాల్గోన్నారు.

రాయలసీమ రత్నం టీకేఆర్ శర్మ

● క్లస్టర్ వీసీ డీవీఆర్ సాయిగోపాల్


మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, గాంధేయవాది, రాయలసీమ గర్వించదగ్గ వ్యక్తి టీకేఆర్‌శర్మ అని ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీలో శర్మ శతజయంతి వేడుకల సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఉపకులపతి మాట్లాడుతూ శర్మ నాయకత్వాన్ని, సమాజ ప్రేమను గుర్తుచేసుకుంటు సదస్సును నిర్వహిస్తున్నామని తె లిపారు. గాడిచర్ల ఫౌండేషన్ సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ ప్రముఖ సోషలిస్టుగా వందల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి పెట్టినసేవ పరుడని కొనియాడారు. సమావేశంలో రిజిస్ట్రార్ కే. వెంకటేశ్వర్లు, జేఎస్ఆర్‌కే శర్మ, వింద్యావాసిని, డాక్టర్ పార్వతి, ఫామీద పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారం

గూడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బోర్లు వేసి నీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. శనివారం గ్రామంలో బోరు వేశారు. సురేష్ మాట్లాడుతూ జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకరంతో ఎంపీ నిధుల కింద ఆరు బోర్లు మండలానికి మంజూరు అయ్యాయన్నారు. కె నాగలాపురం, పెంచికలపాడు, ఆర్ కా నాపురం, మునగాల, మల్లాపురం, జులకల్ గ్రామాల్లో బోర్లు వేయించి నీటి సమస్యను పరిష్కరించామన్నారు. కార్యక్రమం మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, సర్పంచ్ మునుస్వామి, మన్యంకొండ, కృష్ణుడు, చిన్న నరసింహులు, పెద్ద నరసింహులు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యత తెలుసుకోవాలి


కొండారెడ్డి బురుజు వద్ద అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు ఉన్న ప్రతి పౌరుడు ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండా రెడ్డి బురుజు వద్ద బీఎల్‌వోలు, వీఆర్‌లతో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు బలమైన పునాది వంటిదన్నారు. ఓటును పొందడం, వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు. ఓటు అనేది వజ్రాయుధం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

గూడూరు: ఓటు వజ్రాయుధం లాంటిదని ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం గూడూరులోని వెలుగు కార్యాలయంలో ఆర్డీవో మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఓటరు ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివనాగ ప్రసాద్, కమిషనర్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, ఆర్ఐ వరలక్ష్మీ, వీఆర్వో మధుకృష్ణ పాల్గొన్నారు.

సి. బెళగల్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో వీఆర్వోలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం, రీసర్వే తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేర్ నాగభూషణం, సిబ్బంది ఉన్నారు.

కర్నూలు నియోజకవర్గ ఆర్వో ఎస్. రవీంద్రబాబు

కర్నూలు ఎడ్యుకేషన్: 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటరు ఓటర్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ర్యాలీలో డీవీఈవో వై.పరమేశ్వరరెడ్డి, డీఎస్పీ మహబూబ్ బాషా, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ పాల్గొన్నారు.

● స్థానిక ఏ.క్యాంపులోని మైఫర్ ఫార్మసీ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, డా.ఎం.రాజ్ కుమార్, రఘువీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ఎస్‌ఏపీ క్యాంపు కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎన్మహబూబ్ బాషా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుగుణమ్మ, డి.రోజమ్మ, కె.శివకుమారి బాయి, రూతమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరు: 18 సంవత్సరాలు దాటిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కార్యాలయంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శివరాం, ఎలక్షన్ డీటీ అనురాధ, ఆర్ఐ రాజేంద్రబాబు, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

● కల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ జి.నాగశేషాచలరెడ్డి ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు.

కురువ ఈరన్నను హత్య చేసిన వారిని శిక్షించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం అరికెరగ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కురువ బండారు ఈరన్నను హత్య చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని జాతీయ సంగోళి రాయన్న సేవ అధ్యక్షులు బత్తిన కిరణ్ కుమార్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ సంయుక్తంగా డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బళ్లారి చౌరస్తాలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో కురువలపై దాడులు అధికమయ్యాయన్నారు. వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కురువ వెంకటరాముడు,శివలింగం, శ్రీనివాసులు, మహేంద్ర, తిరుమలేష్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: హత్యకు గురైన ఫీల్డ్అసిస్టెంట్ బండారి ఈరన్న కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంజిబాబు మాట్లాడుతూ అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్నను హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్‌ను దారుణంగా హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్, నాయకులు బొజ్జప్ప, దేవేంద్ర, వీరరాజు, వీర న్న, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కర్నూలు అగ్రికల్చర్: ఫీల్డ్అసిస్టెంట్ బండారి ఈరన్న హత్య చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డ్వామా జేఏసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి డ్వామా జేఏసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, ఇతర నాయకులు మధుబాబు, మనోహర్ రెడ్డి, జ్ఞానయ్య, రంగస్వామి, తదితర ఉద్యోగులు ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి కలెక్టరేట్ వద్ద సంతాపం వ్యక్తం చేస్తూ కొంతసేపు మౌనం పాటించారు. కొవ్వొతులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ లక్ష్మన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకుంటాం

● కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు: ఎంపీ

కర్నూలు అర్బన్: ఫీల్డ్ అసిస్టెంట్ హత్యలో ఏ పార్టీ వారు ఉన్నా కఠిన చర్యలు తప్పవని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలూరు మండలం అరికెర గ్రామంలో శుక్రవారం జరిగిన హత్యను తీవ్రంగా ఖండించారు. సీఎం చంద్రబాబు కక్ష పూరిత రాజకీయాలు చేసే వారిని ప్రతి పక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసే వారు సొంత పార్టీ వారైన సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈరన్నను టీడీపీ నాయకులు హత్య చేశారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారని, పోలీసు విచారణలో హత్యకు సంబంధించిన అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. హత్యకు పాల్పడిన వారు ఏపార్టీకి చెందిన వారైనా సరే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పిల్లల సంబరాలను జయప్రదం చేద్దాం

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే బాలోత్సవం సంబరాలను వైభవంగా జరిపి జయప్రదం చేయాలని బాలోత్సవ కమిటి ఆహ్వానసంఘం అధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. శనివారం ఉదయం అబ్బాస్‌నగర్‌లోని ఆయన చాంబర్‌లో బాలోత్సవం-2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా నిర్వహంచే బాలోత్సవ సంబరాలు విద్యార్థులకు చిన్ననాటి నుంచి సాంస్కృతిక వైభవాన్ని తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ నిర్వహణ కమిటి సభ్యులు డి.ధనుంజయ, జేఎన్ శేషయ్య, కెంగార మోహన్, రంగస్వామి, వర్మసాయి ఉదయ్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను మరువలేం


రక్తదానం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంకోసం ప్రాణాలను సైతం లెక్కచేయక పోరాడిన అమరవీరుల త్యాగాలను మరువలేమని కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లు శ్రీనివాసులు, వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపువెండర్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్లు మాట్లాడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు బ్లడ్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రహిమాన్, రామకృష్ణ, అన్వర్, చందు, ఆంజనేయులు, వేణుగోపాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు చేసేందుకు హామీ

కర్నూలు రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామ పరిధిలో 2013లో ఇచ్చిన ఇంటి స్థల పట్టాలకు త్వరలోనే హద్దులు ఏర్పాటు చేయిస్తానని కోడుమూరు టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు టీడీపీ నాయకులు పేరపోగు పెద్దలక్ష్మన్న తెలిపారు. లబ్ధిదారులతో పెద్ద లక్ష్మన్న శనివారం కర్నూలులోని విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. గ్రామంలో 277 సర్వే నెంబరులో అప్పటి ప్రభుత్వం భూమి కేటాయించి దాదాపు 1300 మంది నిరుపేదలకు ఇంటి స్థల పట్టాలు ఇచ్చిందని విష్ణుకు వివరించారు. వారందరికీ రెవెన్యూ అధికారులు ప్లాట్లు కేటాయించి హద్దుల ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉండగానే ఎన్నికల కోడ్ వచ్చిందని తెలిపారు. ఈ నెల 30న తాండ్రపాడుకు వచ్చి సమస్యను పరిష్కరిస్తానని విష్ణువర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు న్యూసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన చిదంబరావు వీధి, కృష్ణానగర్, కొత్తపేట, ఎన్ఆర్‌పేట తదితర ప్రాంతాలలో పర్యటించారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకుని మెరుగైన పారిశద్యం అందించేందుక ఏర్పడే ఆటంకాలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు.

పంచలింగాలలో సీపీడబ్ల్యూ స్కీమ్ పరిశీలన

కర్నూలు రూరల్ జనవరి25(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో తుంగభద్ర నదికి ఆనుకొని ఉన్న సీపీడబ్ల్యూ స్కీమ్ పథకాన్ని శనివారం జడ్పీ సీఈవో నాసరరెడ్డి తనిఖీ చేశారు. వాటితో పాటు నదిలో ఇన్‌ఫిల్టర్ వెల్స్‌ను కూడా పరిశీలించారు. అనంతరం గ్రామంలో సచివాలయానికి వెళ్లి అక్కడి సిబ్బందితో పలు సర్వేల గురించి పలు సూచనలు చేశారు. జడ్పీ సీఈవో వెంట జడ్పీ ఏవో జితేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రఘునాథ్ ఉన్నారు.

రోగులకు తప్పని తిప్పలు

● స్కానింగ్ కోసం గంటల తరబడి నిరీక్షణ ● పట్టించుకోని వైద్యాధికారులు


ఎక్స్‌రే పరీక్షల కోసం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ వద్ద రోగులు



కర్నూలు హాస్పిటల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో వైద్య పరీక్షలు, స్కానింగ్ పరీక్షల కోసం రోగులు నిరీక్షిస్తున్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా చిప్పదొడ్డి గ్రామానికి చెందిన సుభద్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉదయం 9 గంటలకు గైనిక్ వార్డుకు వచ్చింది. వైద్యులు పరీక్షించి రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ రాసిచ్చారు. ఉదయం 10 గంటలకు రక్తపరీక్షలు అయిపోవడంతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం న్యూడయోగ్నస్టిక్ బ్లాకులోని అల్ట్రాసౌండు రూం 2, 3 దగ్గరకు వచ్చింది. సుభద్ర తన మూడేళ్ల కూతురిని తీసుకునివచ్చింది. గంటల తరబడి పడిగాపులు కాయలేక తన కూతురిని నేలపై పడుకోబెట్టింది. వైద్యులు మాత్రం సుభద్రను స్కానింగ్ పరీక్షలకు పిలువలేదు. ఉదయం 10 గంటల నుంచి వేచి చూస్తున్నానని, ఆడ బిడ్డను చూసుకునే వారు లేక ఇక్కడికి తెచ్చానని, ఇక్కడ గంటలు గడుస్తున్నా ఎవ రూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. చివరకు మధ్యాహ్నం 2.15 గంటలకు స్కానింగ్ పరీక్ష అయిపోవడంతో పడుకోబెట్టిన బిడ్డను ఎత్తుకొని వైద్యుల దగ్గరకు వెళ్లింది. ఇలా అల్ట్రాసౌండు పరీక్షల కోసం ఒక్క సుభద్ర మా త్రమే కాక రోగులందరూ ఇబ్బందులు పడుతున్నారు.

● **టోకెన్‌లు ఇవ్వని సిబ్బంది:**

అల్ట్రాసౌండు స్కానింగ్ పరీక్షలు కావాల్సిన ఓపీ రోగులకు న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో అల్ట్రాసౌండు 2, 3 కేంద్రాల వద్ద టోకెన్ ఇస్తారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత టోకెన్‌ను కొద్ది రోజులుగా నిలిపివేశారు. వంద టోకెన్‌లు మాత్రమే ఇస్తున్నారని, మధ్యాహ్నం 12 గంటల తర్వాత టోకెన్‌లు ఇవ్వకపోవడంతో తామంతా పడిగాపులు కాస్తున్నామని రోగులు మండిపడుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రేడియాలజీ వైద్యులు గానీ, ఆసుపత్రి అధికారులు గానీ దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోగుల కోసం మధ్యాహ్నం 3 గంటల వరకు టోకెన్‌లు ఇచ్చి అల్ట్రాసౌండు స్కానింగ్ పరీక్షలు నిర్వహించాలని రోగులు కోరుతున్నారు.

ఎక్స్‌రే కోసం తిప్పలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎక్స్‌రే పరీక్షల కోసం వచ్చే రోగులు తిప్పలు తప్పడం లేదు. శనివారం పాత రేడియాలజీ విభాగంలో కంప్యూటర్ రేడియోగ్రఫీ రూంలోని క్యాసెట్ రీడర్ కాలిపోవడంతో అక్కడ ఎక్స్‌రే పరీక్షలు నిలిచిపోయాయి. పాత రేడియాలజి విభాగంలో ఎంఎల్‌సీ, క్యాజువాల్టీ, 5 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రతి రోజూ 200 నుంచి 250 ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తారు. కానీ క్యాసెట్ రీడర్ కాలిపోవడం, ప్రింటర్ తరచుగా పని చేయకపోవడంతో పాత రేడియాలజీకి ఎక్స్‌రే పరీక్షల కోసం వచ్చిన రోగులను న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు పంపడం, అక్కడ నుంచి మళ్లీ ఇక్కడకి పంపడంతో రోగులు తిరగలేక నీరసించిపోయారు. ముఖ్యంగా ఎంఎల్‌సీ, క్యాజువాల్టీ చిన్నారులు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్, పాత రేడియాలజీ విభాగానికి తిరగలేక అవస్థలు పడ్డారు.

వైద్య పరీక్షలను వినియోగించుకోండి

కర్నూలు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో ప్రభుత్వం నిర్వహించే అన్ని రకాల వైద్య పరీక్షలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు పేరపోగు పెద్ద లక్ష్మన్న విజ్ఞప్తి చేశారు. శనివారం గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఏఎన్ఎం కృష్ణవేణి మాట్లాడుతూ తాండ్రపాడులో 1821 ఇళ్లలో 173 మందికి క్యాన్సర్, షుగర్, బీపీ, వంటి పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి యశోద, మల్లేశ్వరి, హైమావతి, మరియమ్మ పాల్గొన్నారు.

న్యాయాధికారులకు వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి

కర్నూల లీగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని న్యాయాధికారులకు ఉచిత న్యాయ శిబిరం జరిగింది. స్థానిక న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజూ కేసులతో సతమతమయ్యే న్యాయాధికారులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా.సుధాకర్, అశ్విని హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పాండురంగారెడ్డి, భూపాల్ రెడ్డి, బీ.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, అపోలో హాస్పిటల్ మేనేజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల తనిఖీలు

కర్నూలు క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసులు నగరంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్, కొత్తబస్టాండు, రాజ్‌విహార్ కూడలి, ఆర్ఎస్ రోడ్డు, కలెక్టరేట్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, పెరేడ్ మైదానం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బాంబ్ స్క్వాడ్ డాగ్ స్క్వాడ్, ఏఆర్ పోలీసులు పలు వాహనాలను ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారు. అలాగే పలు షాపింగ్ మాల్స్‌లో కూడా తనిఖీలు చేశారు. లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో బాంబ్ స్క్వాడ్ టీం ఏఆర్ఎస్ఐ నబి రసూల్, హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, బ్యాగ్ హ్యాండ్లర్ చంద్రశేఖర్ ఉన్నారు.

సీపీఐ నాయకుల నిరసన

కర్నూలు న్యూసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకులను లలిత కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దూషించారని ఆరోపిస్తూ సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. నగరంలోని సీ క్యాంప్‌లో కళాక్షేత్రం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ కళాక్షేత్రంలో శుక్రవారం సీపీఐ వందేళ్ల వేడుకలను నిర్వహించిందన్నారు. ఈ క్రమంలో అధ్యక్షుడు ఓబులయ్య తమను కించపరిచేలా దుర్భాషలాడినట్లు ఆరోపించారు. కళాక్షేత్రంలో తమ కార్యక్రమం జరుగుతుండగా ఓ యువతి కళ్లు తిరిగి పడిపోయిందన్నారు. వెంటనే ఆసుపత్రికి తరలించామన్నారు. ధర్నా అనంతరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు మహేష్, రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యలు పరిష్కరించాలని రజక ఐక్య సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేంపెంట రాంబాబు అన్నారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావును కలిశారు. రాష్ట్ర స్థాయిలో నెలొన్న రజకుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే బిల్లును ఆమోదించాలని కోరారు. జీవో 27ను అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేకర్ పాల్గొన్నారు.

నేడు ట్రాక్టర్, బైక్ ర్యాలీ

● ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గణతంత్ర వేడుకల నేపథ్యంలో ఆదివారం కర్నూల్లో ట్రాక్టర్, బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు సాగించిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసిందన్నారు. రైతు ఉద్యమానికి తల వంచి రద్దు చేసిన చట్టాలను తిరిగి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్నదని అన్నారు. దీనికి నిరసనగా ఆదివారం చేపట్టనున్న ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందబాబు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, కేజీబీఎస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం నాయకులు మధు, రామాంజనేయులు, కృష్ణ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

వర్గీకరణ పేరుతో దళితులను చీల్చవద్దు

- సుప్రీంకోర్టు తీర్పును ఖండిస్తున్నా
- ఊయల బ్రిడ్జి వద్దు.. ఆనకట్ట బ్రిడ్జి నిర్మించాలి
- కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్



కర్నూలు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో దళితులను చీల్చవద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతామెహన్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్పుఇ వ్వడాన్ని పూర్తిగా తప్పు పడుతున్నామని తెలిపారు. వర్గీకరణ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దళితుల పట్ల వివక్ష చూపే జస్టిస్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం సమంజసం కాదని అన్నారు. నేటికి దళితవాడలు అభివృద్ధి లేక, అంటరానితనంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఓబీసీలను ఆదుకునేందుకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క శాతం నిధులు కూడా ఈ వర్గాల కోసం ఖర్చు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో అమరావతి, పోలవరం కోసం వేలాది కోట్ల నిధులు అప్పులు తేవడం అవసరమా? అని ప్రశ్నించారు. ఈ భారం అంతా ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుందరమైన సంగమేశ్వరాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా పరిశీలించి టూరిజం హబ్‌గా వసతుల కల్పించాలని కోరారు. సంగమేశ్వరం వద్ద నదిపై ఊయల బ్రిడ్జి నిర్మించడాన్ని తప్పు పట్టారు. వెంటనే ఆనకట్ట బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం రైతులు త్యాగం చేసిన వేలాది ఎకరాల భూములను బీజేపీ, వైసీపీ నాయకులు అమ్ముకునేందుకు తెగబడుతున్నారని ఆరోపించారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు సాధించిందేమీ లేదని, కేవలం మాటల గారడి తప్ప రాష్ట్రానికి పెట్టు బడులు రావడం అంత ఈజీ కాదని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అశోకరత్నం పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల పత్తి దహనం

మంత్రాలయం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కురువ హుశేనికి చెందిన 20 క్వింటాళ్ల పత్తి దహనమైంది. ఇంట్లో భద్రపరుచుకున్న పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి నిప్పు పెట్టారు. దీంతో 20 క్వింటాళ్ల పత్తి కాలి బూడిదైపోయింది. పక్కనే ఉన్న ఇరుగు పొరుగు వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసి పొలంలో ఉన్న ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. యజమాని వచ్చేలోపే పత్తి కాలి బూడిదైంది. పత్తి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, మరో రెండు రోజుల్లో అమ్ముకుందామని సిద్ధమవుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి తీవ్ర నష్టం కలిగించారని వాపోయాడు. ప్రభుత్వం పత్తి రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆటోలు ఢీకొని పదో తరగతి విద్యార్థిని మృతి

మరో నలుగురికి గాయాలు



(అనూష ఫైల్)

మంత్రాలయం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆటోలు ఢీకొని పదో తరగతి విద్యార్థిని మృతి చెందింది. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చౌలహల్లి గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. మాధవరం ఎస్‌ఐ విజయకుమార్ వివరాల మేరకు.. సుంకేశ్వరి గ్రామానికి చెందిన గొర్రెల ఆంజనేయ, ఈరమ్మ దంపతుల కూతురు అనూష (15) విద్యా నగర్‌లోని ఎస్‌ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ విద్యార్థినితోపాటు అదే గ్రామానికి చెందిన ఈడిగ మూర్తి, అమృత, శ్రీలత, గౌతమిలు కూడా అదే పాఠశాలలో చదువుతున్నారు. ఆటో ఎక్కి కొద్ది దూరం వెళ్లిన తర్వాత రాయచూరు నుంచి ఆదోనికి వెళ్తున్న మరో ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈడిగ మూర్తి, అమృత, శ్రీలత, గౌతమిలకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు అనూష మృతి చెందింది. ఆంజనేయ, ఈరమ్మలకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. వీరిలో పెద్ద కొడుకు రాజు వ్యవసాయం పనులు చేస్తున్నాడు. తమ్ముడు అంజి 5వ తరగతి స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కూతురును బాగా చదివించాలనుకున్న తల్లిదండ్రుల ఆశలను ఆటో ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన ఎమ్మిగనూరు ఆసుపత్రికి వెళ్లారు. మృతి చెందిన కూతురిని చూసి గుండెలవిసెలా రోదించారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, జగదీష్, బాలయ్య, ఉమాశంకర్, జగదీష్, అనిత పాఠశాలకు సెలవు ప్రకటించి సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి నివాళులర్పించారు. మాధవరం ఎస్‌ఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం కలకలం

- బెట్టింగ్ యాప్స్ దెబ్బకు రూ.13 లక్షల అప్పులు
- ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆరు పేజీల లేఖ
- ఐదు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



నిరంజన్

ఆత్మకూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ దెబ్బకు నిరంజన్(26) అనే ఓ యువకుడు సూసైడ్ లెటర్ రాసి అదృశ్యమైన ఘటన ఆత్మకూరు ప్రాంతంలో కలకలం రేపుతోంది. పట్టణంలోని తిక్కయ్యస్వామి దర్గా సమీపంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్‌బాషా కుమారుడు నిరంజన్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ రంగంలో తనకున్న అనుభవంతో క్రెడిట్ కార్డు, ఇతర యాప్‌ల ద్వారా సుమారు రూ.13 లక్షల వరకు అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బంతా బెట్టింగ్ యాప్‌ల్లో పోగొట్టుకున్నాడు. దీనికితోడు కొందరి నుంచి డబ్బు తీసుకొని వారి పేరిట తన ఫైనాన్స్ సంస్థ ద్వారా కావాల్సిన సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు చేశాడు. ప్రస్తుతం వారు ఫైనాన్స్ కంపెనీకి ఎలాంటి అప్పు లేనప్పటికీ వారి పేరిట అప్పు చూపిస్తూ కంపెనీ వారి నుంచి ఒత్తిళ్లు రావడంతో బాధితులందరూ అతన్ని నిలదీసినట్లు తెలిసింది. మొత్తానికి చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరు పేజీలతో కూడిన సూసైడ్ నోట్ రాశాడు. తల్లిదండ్రులు, భార్య తనను క్షమించాలని వేడుకుంటూనే తాను మరణిస్తే తన పేరిట ఎల్‌ఐసీ బాండ్ల ద్వారా వచ్చే డబ్బుతో అప్పులు ఇచ్చిన వారికి తిరిగి చెల్లించాలని అందులో రాసి కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. ఈ క్రమంలోనే విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో తన బైక్‌ను రఘునాథ్ సెంటర్‌లో వదిలేసి నంద్యాల టర్నింగ్ వైపు నడుచుకుంటూ వెళ్లినట్లు సీసీ పుటేజీల ద్వారా గుర్తించారు. శనివారం రాత్రి వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీలు, బంధువులు అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నారు. అర్బన్ సీఐ రాము నేతృత్వంలో ఆరు బృందాలు ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే నిరంజన్‌కు ఏడు నెలల క్రితమే వివాహమైంది. ఇంతలోనే ఇతను అదృశ్యం కావడం ఆ కుటుంబంలో ఆందోళన రేపుతోంది. గతంలో కూడా నిరంజన్ ఇదే తరహాలో రూ.8లక్షల వరకు బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లి అప్పులపాలవగా ఆయన తండ్రి మహెబూబ్‌బాషా వాటిని తీర్చాడు. మళ్లీ ఆ యువకుడు బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లి ఆత్మహత్య వరకు వెళ్లడం గమనార్హం.

నిరుద్యోగ యువత నైపుణ్యం పెంచుకోవాలి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- మెగా జాబ్ మేళా



అపాయింట్‌మెంట్ పత్రాలు అందిస్తున్న గౌరు దంపతులు

కల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు స్కిల్స్‌ను (నైపుణ్య శక్తిని) పెంపొందించుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని దేవి ఫంక్షన్ హాలులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, అమర్‌రాజా గ్రోత్ కారిడార్, మెడ్‌ప్లస్ సంయుక్త ఆధ్వర్యంలో మోగా జాబ్ మేళా నిర్వహించారు. 1200 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ 2014లో ఓర్వకల్లును ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటామ న్నారు. విమానాశ్రయం, జయరాజ్ ఇస్పాత్ స్టీల్‌ప్లాంట్, సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్ర బాబుకే దక్కుతుందన్నారు. ఓర్వకల్లులో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించా రు. అమర్‌రాజా గ్రోత్ కారిడార్ నిర్వాహకులతో చర్చించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

యువత నైపుణ్యం అలవర్చుకోవాలి : నిరుద్యోగ యువత నైపుణ్యం అలవర్చుకుని పట్టుదలతో ముందుకు వెళ్లి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేసి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో రైతులకు డ్రోన్ సేవలు అందించాలని ఆసక్తి ఉన్న సభ్యులకు ప్రభుత్వం సబ్సిడీతో డ్రోన్లను అందించనుందన్నారు. కార్యక్రమంలో రవీంద్ర, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేతలు జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి, అమర్‌రాజా అధికారి కళ్యాణ్, నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, నాగిరెడ్డి, గంగాధర్‌గౌడ్, జనార్ధన్ ఆచారి, పుల్లారెడ్డి, ఈవీ రమణ మాదేష్ తదితరులు పాల్గొన్నారు.

శరీర దానానికి ముందుకొచ్చిన దంపతులు

- అభినందించిన ప్రిన్సిపాల్



ప్రిన్సిపాల్‌కు శరీరదానం అంగీకార పత్రాన్ని అందిస్తున్న దంపతులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం యనగండ్ల గ్రామానికి చెందిన దినేష్, శకుంతల దంపతులు తమ మరణానంతరం తమ శరీరాలను వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం ఉపయోగించుకోవచ్చుని అంగీకారపత్రాన్ని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారిని అభినందిస్తూ స్వచ్ఛందంగా శరీర దానం చేయడం ఆదర్శప్రాయమని అన్నారు.

గందరగోళంగా సీనియారిటీ లిస్టు

కర్నూలు హాస్పిటల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ల సీనియారిటీ లిస్టు గందరగోళంగా తయారైంది. జిల్లాల వారీగా విడుదల చేసిన ఈ జాబితాలో కొందరి పదోన్నతుల పేర్లు పొందుపరచడం పై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. జీవో.నెం.273 ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెరిట్, రోస్టర్ ద్వారా మాత్రమే రీడిప్లాయిమెంట్ చేయాలని హెల్త్ అసిస్టెంట్లు కోరుతున్నారు. సీనియారిటీ జాబితాను ఏ జిల్లాకు ఆ జిల్లాకు కౌన్సిలింగ్ చేస్తే కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కిందకు వస్తుందన్నారు. అలాగే కౌన్సిలింగ్‌లో ట్రైబల్ తెగలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

యువతి ఆత్మహత్య

డోన్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వట్టివల్ల రజిత (20) అనే యువతి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. తండ్రి లక్ష్మన్న ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని రజిత గ్రామ సమీపంలోని పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కమ్యూనిస్టులంటే నాకు గౌరవం

- దుర్భాషలాడినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం
- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య




అభివృద్ధికి నోచుకోని నాటి లలితకళా సమితి చిత్రం చూపిస్తున్న పత్తి ఓబులయ్య, సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులంటే తనకు ఎంతో గౌరవభావం ఉందని, తాను వారిని దుర్భాషలాడినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం సాయంత్రం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని చెప్పారు. తాను కళారంగానికి తప్ప రాజకీయ రంగం గురించి ఎప్పు డూ చర్చించనని స్పష్టం చేశారు. టీజీవీ కళాక్షేత్రం నేడు రాష్ట్రంలోనే పేరుపొందిన కళాసంస్థగా రూపుదిద్దుకుందని చెప్పారు. ఒకనాడు ఆరుబయలు కళాక్షేత్రంగా ఉన్నదాన్ని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సహకారంతో సుందరమైన కళాక్షేత్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. నిత్యం కళారూపాలతో విరాజిల్లుతున్న కళాక్షేత్రంపై అందరి దృష్టి ఉంటుందన్నారు. కావాలనే అపవాదులు వేస్తున్న కొందరు తీరును మార్చుకోవాలన్నారు. తనకు కళాక్షేత్రంపై సంపాదించి బతకాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కళాక్షేత్రం అభివృద్ధికి నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పుడు జరిగిన సంఘటన కమ్యూనిస్టు నాయకులు మర్చిపోవాలని కోరారు. కళారంగానికే టీజీవీ కళాక్షేత్రం పని చేస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 38 నంది అవార్డులు సాధించి రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్నా మని, ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తనపైన ధర్నాలో చేసిన అపవాదులను ఖండిస్తున్నా నన్నారు. ఏ ప్రభుత్వ శాఖ అధికారులైన వచ్చి లెక్కలు చూసుకోవచ్చని, టీజీవీ కళాక్షేత్రం ప్రతి ఏటా ఆడిట్ రిపోర్టు ఆదాయ పన్నుల శాఖచే ఆమోదం పొందుతోందని అన్నారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు పి. రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, సీవీ రెడ్డి, సంగా అంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, ఎండీ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర తీరం
సాహిత్యం

ఉద్వేగాలను తట్టిలేపే మానవ జీవనయానం



మానవ జీవనయానం' పుస్తకం

కర్నూలు కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'కడుపు చీల్చుకొని జన్మనిచ్చాను...కడుపు మాడ్చుకొని నీ కడుపు నింపాను, కష్టం తెలియకుండా కన్నీళ్లు దిగమింగి పెంచాను...కానరాని దేశం వెళ్లి కడచూపుకైనా వస్తావను కున్నా...కన్నకొడుకు కన్నా కాటికాపరే మిన్న' అంటూ సుదూర తీరాల్లో ఉండి, తన తుదిదశలోనూ రాని కన్నకొడుకు గురించి ఓ తల్లి పడే వేదనను ఈ పుస్తకంలోని ఓ కవిత అద్దం పడుతుంది. 'నాన్న వేలు పట్టి తిరగనే లేదు...నాన్న వీపు నెక్కి గుర్రమాట ఆడలేదు, అమ్మా నీ లాలిపాట విననే లేదు...ర్యాంకుల ఫ్యాక్టరీలో మార్కుల యంత్రమైనాను నేను' అంటూ ఆర్ద్రంగా ఒక బాలుని స్వగతాన్ని మరో కవిత వినిపిస్తుంది. ఆధునిక యుగంలో మారుతున్న మానవ సంబంధాలు, మానవీయ విలువలను గుర్తు చేస్తుంది బీజీ రాజారెడ్డి రాసిన 'మానవ జీవనయానం' కవితా సంపుటి. ఎప్పుడో, ఎక్కడో మనందరికీ తారసపడిన వ్యక్తుల జ్ఞాపకాలను ఒకచోట ప్రోది చేస్తూ ఈ కవిత్వం రాశారు. సమకాలీన సమాజంలో జరుగుతున్న అనేక ఘటనలకు రాజారెడ్డి అక్షర రూపం ఇచ్చారు. ప్రపంచీకరణ ముసుగులో ఈ విశాల ప్రపంచం ఎంత ఇరుకై పోయిందీ తెలియజేశారు. బనగానపల్లె మండలం, యనకండ్ల గ్రామానికి చెందిన బీసీ రాజారెడ్డి ప్రజా ప్రతినిధిగానే కాకుండా, ప్రజా కవిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అరుణభారతి సాహితీ సంస్థను స్థాపించి, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాషామతల్లికి ఎనలేని సేవలు అందిస్తున్నారు.

సమాజ గమనానికి దిక్సూచిలా...

సమకాలీన సామాజిక సమస్యల పట్ల స్పందించే స్వభావం ప్రతి మనిషికీ ఉండాలి. అలాంటి దూరదృష్టి కలిగిన కొందరు సాహితీవేత్తల్లో బీసీ రాజారెడ్డి ఒకరు. గాడి తప్పుతున్న సమాజం పట్ల నిబద్ధత కలిగిన రచయితగా బీసీ రాజారెడ్డి 'మానవ జీవనయానం' రాశారు. సమాజంలోని స్థితిగతులకు యధాతథంగా అద్దంపట్టి పాఠకుల ముందుకు ఆ దృశ్యాలను అక్షర రూపంలో తీసుకువచ్చారు. అనునిత్యం సేవా కార్యక్రమాలతో ఉండే ఆయనలోని ఒక కొత్త కోణం ఈ పుస్తకంలో ప్రతిబింబిస్తుంది. 'మానవ జీవనయానం' పుస్తకంలో 16 కవితలు వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి. అలాగే ఈ పుస్తకంలోని నిత్యసత్యాలన్నీ ఆణిముత్యాలే. అరుణభారతి సంస్థ ద్వారా బనగానపల్లెలో అనేకానేక సాహితీ సభలు నిర్వహిస్తున్న రాజారెడ్డి తన హృదయస్పందననే కాదు, తన సామాజిక బాధ్యతను కూడా ఈ పుస్తకం ద్వారా వ్యక్త పరిచారు. ఈ పుస్తకానికి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి తొలిమాట రాయగా, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య కొలుకలూరి ఇనాక్ ప్రశంసాత్మక సందేశం ఇచ్చారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య ప్రజాకవిగా బీసీ రాజారెడ్డిని వర్ణిస్తే, సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి, కవి ఎస్‌ఎండీ ఇనాయతుల్లా తమ అక్షరాభినందనలు తెలియజేశారు. ఈ పుస్తకాన్ని దివంగత దర్శకరత్న దాసరి నారాయణరావు 2015 డిసెంబరు 27న హైదరాబాదులోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించి, రచయితను ఘనంగా సత్కరించారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తుంది.



'మానవ జీవనయానం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దివంగత దర్శకరత్న దాసరి నారాయణరావు (ఫైల్)

అమ్మకు జోలాలి



మెత్తటి మట్టి
పూల మొక్కకు బువ్వలా
దేహం నిండా
కనిపించని గోరుముద్ద అమ్మ...!

పురిటి గదిని తాకినప్పుడంతా
తొలి చినుకు జన్మ పరిమళంలా
అమ్మ వాసన...!

పిచ్చింది...
చివరి కోరిక అడగకుండా
చిరాయువుగా
జీవించమని
దీవించింది...!

భూమి మీద
విమోచనం లేని
తీపి వరాల
శాపగ్రస్త...అమ్మ...!

జన్మఖైదులో
కనిపించని
శిలువ
మోస్తున్న
ఆడ క్రీస్తు...!

దేహమిచ్చి
తప్పుకున్నా
అర్ధాంగిలో సగం చేరి
మళ్లీ భర్తీ అయింది...!



తన నుదుటిపై
చెమట బిందువులు
రాలినప్పుడంతా
అరుగుతోన్న గంధం
గుర్తొస్తుంది...!

- తెలుగు వెంకటేశ్, కర్నూలు

నగరంలో నేడు

- ఉదయం 9 గంటలకు జిల్లా పోలీసు కవాతు మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఆరంభమవుతాయి. కలెక్టర్ రంజిత్‌బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.
- ఉదయం 10.30 గంటలకు నగరంలోని సంకల్‌బాగ్‌లోగల విశ్వక్ గార్డెన్స్‌లో నెహ్రూ మెమోరియల్ హైస్కూలు (1974-1976) పూర్వ విద్యార్థుల సమ్మేళనం, గురువులకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నారు.
- మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని మౌర్య ఇన్ పరిణయ హాలులో మీడియా సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధికై, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ నేతృత్వంలో, మిత్రుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఏపీ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వివరాలు టీజీ వెంకటేశ్ తెలియజేస్తారు.
- సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శనలు, దేశభక్తి గీతాల ఆలాపన ఏర్పాటు చేశారు.





కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

ఆర్‌ఐ లేక అవస్థలు

- తుగ్గలి మండలంలో ఆర్‌ఐ పోస్టు ఖాళీ
- పనులు అవక అవస్థలు పడుతున్న ప్రజలు
- ఉన్నతాధికారులకు నివేదించాం : తహసీల్దార్



కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా



భూ సమస్యల పరిష్కారానికి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఆర్‌ఐ లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. మా గ్రామం ఇక్కడికి 30 కిలోమీటర్ల దూరం ఉంది. అలాగే కులం, ఆదాయ ధ్రువీకరణకు కూడా ఇబ్బంది పడుతున్నాం. **- రాజు నాయక్, వైజీ తండా**

ఉన్నతాధికారులకు నివేదించాం



రవికుమార్ నాయక్‌ను తుగ్గలికి నియమించారు. అయితే ఆయన డిప్యూటేషన్‌పై కర్నూలు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రజలకు సమస్య రాకుండా చూస్తాం. **- రమాదేవి, తహసీల్దార్**

తుగ్గలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌ఐ సుధాకర్ రెడ్డిని మూడు నెలల క్రితం సాధారణ బదిలీల్లో ఆలూరుకు బదిలీ చేశారు. అయితే ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా, దాదాపు 50వేల మంది నివసిస్తున్నారు. అలాగే 25వేల హెక్టార్లకు పైగా సాగు భూములు ఉన్నాయి. భూసమస్యలు, పొలం తగాదాలు, సర్వే తదితర వాటికి ఆర్‌ఐ పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

అరెస్టు చేయాలి

ఆదోని అగ్రికల్చర్ జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి చేసుకుంటానని విద్యార్థినిని మోసం చేసిన కౌతాళం మండలం జూనియర్ కళాశాల అధ్యాపకుడు రవికుమార్‌ను అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వారం గడిచినా, అధ్యాపకుడిపై చర్యలు తీసుకోలేద న్నారు. అధ్యాపకుడిని సస్పెండ్ చేసి, అరెస్టు చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాజకీయ ఒత్తిళ్లు తగవు

వెల్దుర్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు తగవని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో లక్ష్మన్న అన్నారు. శనివారం కార్యాలయంలో నిరసన తెలిపారు. అరికెర ఫీల్డు అసిస్టెంటు ఈరన్న మృతికి సంతాపం తెలిపి, మౌనం పాటించారు. ఈసీ పృథ్వీరాజు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు న్యాయం

మద్దికెర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించడంతో వారికి న్యాయం జరిగిందని జిల్లా కల్లు గీత కార్మిక సంఘం కార్యదర్శి ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, టీడీపీ నాయకులు నరసింహులు గౌడు, ఎడవలి రవీంద్రగౌడ్ అన్నారు. శనివారం మాట్లాడుతూ స్థానిక కార్మికులకు మద్యం దుకాణం మంజూరైందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు రుణ పడి ఉంటామన్నారు. రాజశేఖర్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్, సోమశేఖర్‌గౌడ్, హరినాథ్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడు తదితరులు ఉన్నారు.

'పది'లో ప్రతిభ చూపాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో రంగస్వామి

మద్దికెర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ప్రతిభ చూపాలని ఎంఈవో రంగస్వామి అన్నారు. శనివారం కస్తూర్బా పాఠశాలలో ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పించిందన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారికి పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గోపాల్, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు ఎంజీ నాగరాజు, నిత్యరాజు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య బాధాకరం

- జనసేన ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ హత్య బాధాకర మని జనసేన ఆలూరు ఇన్‌చార్జి వెంకప్ప శనివారం ప్రకటనలో అన్నారు. ఎన్డీఏ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని, ఈ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. దోషులను శిక్షించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెబుతూనే ఉన్నారన్నారు. వివాదాలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప, హత్య వరకు రావడం సమాజానికి ప్రమాదకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

ఉద్యోగులకు క్రికెట్ టోర్నమెంట్



కమిషనర్ కృష్ణను కలిసిన ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్

ఆదోని టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ముజీబ్ అహ్మద్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఆల్ డిపార్ట్‌మెంట్ ఫ్రెండ్ షిప్ కప్-2025 పేరుతో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మునిసిపల్ మైదానంలో టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. కమిషనర్ కృష్ణకు సమాచారం ఇచ్చామన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ

ఆదోని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీగా హేమలత శనివారం సబ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలు, పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విషయాలపై చర్చించారు.



సబ్ కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న డీఎస్పీ

ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు

పత్తికొండ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ- ఆదోని రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ విలేజ్ సర్వేయర్ గాయపడ్డారు. వివరాలు.. ఆస్పరి మండలం అలిగేర గ్రామ సర్వేయర్ నాగేంద్రమ్మ పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిమిత్తం ద్విచక్రవాహనంలో బయలుదేరింది. అయితే చిన్నహుల్తి, దేవనబండ గ్రామాల మధ్య కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్డీవో భరత్ నాయక్ ఆసుపత్రికి చేరుకుని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

డోన్ ఎమ్మెల్యే కోట్లకు పరామర్శ



ఎమ్మెల్యే కోట్లను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని తుగ్గలి టీడీపీ నాయకులు పెద్ద తిమ్మయ్య, దేవేంద్ర పరామర్శించారు. శనివారం డోన్‌లోని కోట్ల నివాసంలో ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోట్ల కుటుంబం రైతు క్షేమం కోసం పాటుపడిందని, దివంగత మాజీ సీఎం కోట్ల అడుగుజాడల్లోనే తనయుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నడుస్తున్నారన్నారు.టీవీ సోమన్న తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఖాజీపుర వాసులు కోరారు. ఎమ్మెల్యే పార్థసారథి చూచన మేరకు బీజేపీ నాయకుడు వెల్లాల మధుసూదన శర్మ శనివారం కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మురుగు కాలువలు సరిగా లేవని, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొం టున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అభివృద్ధి పనులను చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారని శర్మ తెలిపారు. ఆయన వెంట మహబూబ్ బాషా తాహేర్, బాష, వలి, ఇబ్రహీం పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కూటమి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి



ఈరన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్న కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. సీఎం చంద్రబాబు, కుమారుడు లోకేష్ దావోస్‌లో రెడ్‌బుక్ అమలు చేస్తామని చెప్పడం హత్య రాజకీయాలను ప్రోత్సహించడానికేనన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి వైసీపీ నాయకులను ఊచకోతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం అధికార పార్టీ నాయకుల ప్రోత్సాహంతోనే ఈ హత్య జరిగిందని ఆరోపించారు. హత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులను చేతగాని వారిగా చూస్తే, అధికార పార్టీ నాయకులపై ఎదురుదాడి చేస్తామని హెచ్చరించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవరించకుండా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ కృష్ణమోహన్, జడ్పీటీసీ కిట్టు, వైసీపీ నాయకులు జనార్దన్ నాయుడు, నాగప్ప, గోవర్దన్, వీరేశ్, ఓబులేసు, గిరి, కిషోర్, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలను టీడీపీ ప్రోత్సహించదు

- సీఎంపై ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు
- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హత్యా రాజకీయాలను టీడీపీ ప్రోత్సహిందని, అవి తమ నైజం కాదని, అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్య బాధాకరమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ బీసీల పార్టీ అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన వారిని ఊపేక్షించవద్దని పోలీసులకు సూచించామన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షి సీఎం చంద్రబాబు, తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజాసేవ చేయడానికే వచ్చామని, హత్యా రాజకీయాలు చేయడానికి రాలేదన్నారు. హత్యకు గురైన ఈరన్నకు టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించారన్నారు. రాంనాథ్ యాదవ్, కిష్టప్ప, కన్వీనర్ అశోక్, రఘు, ప్రసాద్‌రెడ్డి, అట్టికల్ జగన్ మోహన్, బాబు, తిమ్మయ్య, రవి యాదవ్, రంగన్న, సుభాన్, రాముడు, మల్లన్న, నరసప్ప, మసాల జగన్, నారాయణ, సురేంద్ర కొమ్ము రామాంజనేయులు, రాజు, రంగయ్య, గూళ్యం రామాంజ నేయులు, అరికెర ఆంజనేయ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఆలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత, సర్పంచ్ మోహన్ రాజు కోరారు. శనివారం మొలగవల్లి గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మద్దతు ధర రూ.7,550లు ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనాథ్ యాదవ్, ఏవో వెంకటేశ్వర గౌడ్, గోదాం మేనేజర్లు ప్రకాష్ రెడ్డి, కరుణాకరన్, ఫీల్డ్ ఆఫీసర్ జయంత్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

ఆస్పరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణమని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి రామాంజినేయులు అన్నారు. శనివారం స్థానిక ఎండీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పాత ఫీల్డ్ అసిస్టెంట్లను కొనసాగించాలని, నిందితులను శిక్షించాలన్నారు. సీపీఐ నేతలు విరుపాక్షి, జి.రంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనీ ఆఫీసర్ శ్రీనివాసులు, న్యాక్ ఇన్‌చార్జి ఉలిగన్న పేర్కొన్నారు. శనివారం జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిరవహించారు. 200మంది అభ్యర్థులు పాల్గొనగా, 59 మందికి ఉద్యోగాలు కల్పించారు. స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, వెంకటేష్, వీరేష్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఎప్పుడు ఇస్తారు?

ఆదోని రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఎప్పుడు ఇస్తారని సీపీఐ కార్యదర్శి గిడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఎనిమిది ఎలలైనా హామీలను అమలు చేయడం లేదన్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదల నుంచి ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 9వరకు అర్జీలను స్వీకరిస్తామని అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

సర్వే పూర్తి చేయాలి

మద్దికెర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌస్‌హోల్డ్, జియో ట్యాగింగ్ సర్వే వంద శాతం పూర్తి చేయాలని డీఎల్‌డీవో అనురాధ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 31వ తేదీలోపు పూర్తిచేయాలని, ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించాలన్నారు. హౌస్‌హోల్డ్ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎంపీడీవో కొండయ్య, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, సుధాకర్, పరమేశ్వరప్ప, మంజునాథ్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయాలి

పత్తికొండ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినం రోజు తలపెట్టిన నిరసనను జయప్రదం చేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు రాజసాహేబ్, వెంకటేశ్వర రెడ్డి, రంగన్న, గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తూ రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సురేంద్ర కుమార్, కారన్న, సిద్దయ్యగౌడు, రంగారెడ్డి, నెట్టికంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసినప్పుడే పండుగ

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ



ఆదోనిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

ఆదోని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు వేసినప్పుడే పండుగ అని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీమా సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు మరియు పోలింగ్ కేంద్రాలలో ఓటర్ నమోదులో ప్రతిభ చూపిన బీఎల్‌వోలకు ప్రశంశాపత్రాలు అందజేశారు. తహసీల్దార్ శివరాముడు, కమిషనర్ కృష్ణ, ఎన్నికల డీటీ గాయత్రి, డీటీ వలి బాషా పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి : ఆర్డీవో

పత్తికొండ టౌన్: ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని డిగ్రీ కళాశాల నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. భారత దేశంలో ఓటుకు ప్రాధాన్యం ఉందన్నారు. పాలకులను గద్దెనెక్కించాలన్నా, దించాలన్నా ఒటే ఆధారమన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవనకొండ: ఓటు ప్రజలకు వజ్రాయిధమని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, తహసీల్దార్ లోకేశ్వరయ్య అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద మానవహారాన్ని నిర్మించారు. వీఆర్వో దాదావలి, హెచ్ఎం మద్దిలేటి పాల్గొన్నారు.

తుగ్గలి: ఓటు తలరాతలను మారుస్తుందని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివార స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఓటరు దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఓటు అమ్ముకోవడం నేరమని, మన భవిష్యత్తును తాకట్టు పెట్టినట్లేనన్నారు. డిటీ నాగరాజు, ఉపాధ్యాయులు చందు నాయక్, వీఆర్వోలు నాగేంద్ర, కాశీ రంగస్వామి, స్వరూప్, తిమ్మయ్య, నవీద్ పటేల్ తదితరులు ఉన్నారు.

మద్దికెర: 18సంవత్సరాలు దాటిన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ సూచించారు. మద్దికెరలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. వీఆర్వోలు రంగస్వామి, రషీద్, హర్ష, స్వర్ణ, రామాంజులు, శ్రీరాములు, మల్లికార్జున, శివన్న ఉన్నారు.

వెల్దుర్తి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ అన్నారు. కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయ పోటీలకు పత్తికొండ విద్యార్థినులు



ముబినాకు క్రికెట్ కిట్ అందిస్తున్న వైద్యుడు సుంకన్న

పత్తికొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్‌జోసఫ్ పాఠశాల విద్యార్థినులు ముబీనా, అమృత జాతీయ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు పీఈటీ నరసన్న తెలిపారు. శనివారం మాట్లాడుతూ వీరు తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారని గుంటూరులో జరిగిన అండర్ -17 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జట్టుకు విజయాన్ని అందించారన్నారు. దీంతో వచ్చేనెల హర్యానా రాష్ట్రం పంచముఖిలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ క్రికెట్‌లో ఏపీ తరఫున ఆడేందుకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులను వైద్యుడు సుంకన్న అభినందించి, రూ25వేల నగదు, క్రికెట్‌కిట్‌ను అందించారు.

మహిళా చట్టాలను గౌరవించాలి



తుగ్గలిలో కిట్లు అందజేస్తున్న న్యాయాధికారి శ్రీవల్లి

తుగ్గలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలను గౌరవించాలని, వారి అభివృద్ధికి కృషి చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ ఇన్‌చార్జి న్యాయాధికారి ఏవీఎస్ శ్రీవల్లి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పత్తికొండ జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును ప్యానల్ న్యాయవాది సూరజ్ నబీ అధ్యక్షతన నిర్వహించారు. మహిళల గొప్పతనం తెలుసుకోవాలని, సమాజంలో స్వేచ్ఛగా తిరిగేలా ప్రోత్సహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వారికి వివాహం చేయా లన్నారు. బాలికలకు చదివించాలని, మహి ళలను అగౌరవ పరిచినా దాడులు చేసినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో విశ్వమోహన్, ఎస్ఐ క్రిష్ణమూర్తి, సీడీపీవో లలిత, ఏపీవో రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, అంబిక, నాగేశ్వరమ్మ, రాఘవేంద్ర, రమాప్రసాద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆస్పరి: చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని ఆలూరు న్యాయధికారి వాణి, సీడీపీవో మద్దమ్మ అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో అవగాహన కల్పించారు.

అభ్యున్నతి కోసమే సవరణ

ఆదోని టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభ్యున్నతి కోసమే రాజ్యాంగ సవరణ చేశామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కునిగిరి నీలకంఠ అన్నారు. అధినాయత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో శనివారం యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి అదూరి విజయ కృష్ణ, నార్త్ టౌన్ అధ్యక్షులు మహదేవ్, రాము, మణికంఠ, శ్రీకాంత్, శివ, కాశీ పాల్గొన్నారు.

బీమా పరిహారం పంపిణీ

దేవనకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గతేడాది నేలతలమర్రి గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లి మృతిచెందిన ఒంటెల రంగన్న కుటుంబానికి రూ.50 వేల బీమా పరిహారాన్ని ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీవో రత్నం, టీడీపీ కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ శనివారం పంపిణీ చేశారు.

బాలికలకు అవగాహన కల్పించాలి



వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లూక్

వెల్దుర్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బాలికలకు వారి సమస్యలపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ సూచించారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సాహిత్య జయరాం, ఏపీఎం అనురాధ, హోమియో వైద్యురాలు భారతి, హెచ్ఎంలు చంద్రావతి, ఐసీపీఎస్ నరసింహులు, ఆర్‌బీఎస్‌కే శ్వేతాకీర్తి పాల్గొన్నారు. కౌమార దశలోని బాలికలకు వారి సమస్యలు, ఆరోగ్యపరమైన అలవాట్లపై అవగాహన కల్పించాలని అన్నారు. పోషణ, పిల్లల సంరక్షణ తితరాలను వివరించాలని కోరారు. సూపర్‌వైజర్లు సరస్వతమ్మ, శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం తలెత్తకుండా చుడాలి

దేవనకొండ: బాలికల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా చుడాలని కిషోరి వికాసం అధ్యక్షులు జ్యోతిలక్ష్మి, మాదమ్మ కోరారు. శనివారం పంచాయతీ ఆవరణలో కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులు మాధవి, రామకృష్ణ మద్దిలేటి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అణగారిన కులాలు రాజ్యాధికారం వైపు నడవాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ

గోనెగండ్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అణగారిన కులాలు ఐక్యతతో రాజ్యాధికారం వైపు నడవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ అన్నారు. శనివారం గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయడమే కాకుండా మహాజన సోషలిస్టు పార్టీ ద్వారా అణగారిన కులాలకు రాజ్యాధికారం వచ్చే వరకు పోరాటం చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సీతారామిరెడ్డి

మంత్రాలయం జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం కర్ణాటకలోని నరహరితీర్థ ఆరాధనకు వెళ్తూ సింధనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు వేద పాఠశాల విద్యార్థులతో సహా డ్రైవర్ కంసాలి శివ కుటుంబాలను టీడీపీ నాయకుడు సీతారామిరెడ్డి పరామర్శించారు. శనివారం విద్యార్థి సుజీయాంద్ర, డ్రైవర్ కంసాలి శివ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేలు నగదును అందజేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబాలకు రాంపురంరెడ్డి సోదరులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గురెడ్డి భీమిరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షులు సీవీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ తెల్ల బండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేశ్ శెట్టి, జనార్దన్ రెడ్డి, గోరుకల్లు కృష్ణ, వీరారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల గ్రేడ్ పెంచాలి

నందవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింత గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల గ్రేడ్ పెంచాలని గ్రామస్థులు పౌలు, వీరేష్, పెద్ద ఈరన్న నరసింహాలు కోరారు. శనివారం నందవరంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం 1 నుంచి 7 తరగతుల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, 10 తరగతి వరకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ జమదగ్ని, ఏలీష, లాజర్, నాగేష్, ఈరన్న పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

మంత్రాలయం జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఓటు వజ్రాయుధం వంటిదని డిప్యూటీ కలెక్టర్ అనురాధ అన్నారు. శనివారం ఓటరు దినోత్సవం సందర్భంగా మంత్రాలయంలో ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హెచ్ఎంలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారకు. వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వీరేంద్ర, షాన్, చంద్రకళ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వీకే గురురాజరావు, సరస్వతి, ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్న, ప్రిన్సిపాల్ రమేష్, హెచ్ఎంలు అంపయ్య, విఠోబరావు, జయరామిరెడ్డి, ఆదాం, అశోక్, వీఆర్వోలు భీముడు, భీమన్నగౌడు, ఆనంద్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శనివారం విద్యార్థులతో కలిసి ఓటు హక్కు విలువపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టణంలో

ఘనంగా ఓటరు దినోత్సవం ర్యాలీ

ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ వీరేంద్రగౌడు, ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వో మోహన్, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. శనివారం నందవరంలోని తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సుదర్శన్‌రెడ్డి, డీటీలు సతీష్, మహేష్ , వీఆర్వో ముగతి రఘు, ఉరుకుందు పాల్గొన్నారు.



రాఘవేంద్ర సర్కిల్‌లో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంలు

కోసిగి: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కోసిగి ఇన్‌చార్జి తహసీల్దార్ రుద్రగౌడు ఆధ్వర్యంలో శనివారం కోసిగిలోని వాల్మీకి సర్కిల్ నుంచి గ్రామ ప్రధాన రహదారుల గుండా అధికారులు, విద్యార్థులతో కలిసి ఓటరుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాల్మీకి సర్కిల్‌లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రుద్రగౌడు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వీఆర్వోలు, పాల్గొన్నారు.



పెద్దకడుబూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కోసిగి వాల్మీకి సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



నందవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు

కక్ష సాధింపులను బీవీ కుటుంబం ప్రోత్సహించదు

టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు జనవరి24(ఆంధ్రజ్యోతి): కక్షసాధింపులను బీవీ కుటుంబం ఎప్పుడు ప్రోత్సహించదని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నాయకులు ముల్లా కలీముల్లా, నవాజ్, జహింగీర్, కేటీ వెంకటేశ్వర్లు, మాచాపురం కాశీం వలి, ఇసాక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టప్రకారమే పోలీసులు కేసునమోదు చేశారని, పట్టణ ఎస్ఐని దూషించింది ఎవరో ఆధారాలు, వీడియోలు ఉన్నాయన్నారు. పోలీసులను గౌరం లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. జరిగిన సంఘటనల ఆధారంగానే వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేశారన్నారు. దీన్ని టీడీపీకి అంటగట్టడం సరికాదన్నారు. తండ్రి బీవీ మోహన్ రెడ్డి బాటలోనే ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఆయన ఏనాడు కక్షసాధింపులకు పాల్పడలేదన్నారు. ఎంతో మంది బాధితుల నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌పై రోజు ఆరోపణలు వస్తున్నాయని, దీని ప్రకారం వెళ్తే రోజు ఒక కేసు పెట్టాల్సి వచ్చేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నజీర్ మాట్లాడాలని లేని పక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌కు ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదన్నారు. ఇప్పటికైన నజీర్, వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోక పోతే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. సమావేశంలో నాయకులు మిన్నప్ప, శాలేము,ఆర్టీసీ అల్తాఫ్, సూరి, నరసప్ప, నరసింహులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉపాధి పథకం ఉద్యోగుల నిరసన

గోనెగండ్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యకు నిరసనగా మండల కేంద్రమైన గోనెగండ్లలో శనివారం ఉపాధిహామీ సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్డీ అనంతశయన, ఎంపీవో మహమ్మద్ బాషా, ఈసీ ఉస్మాన్‌లతో పాటు పలు గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను దారుణంగా హత్య చేయడం శోచనీయమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



గోనెగండ్లలో ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ సిబ్బంది

హత్యా రాజకీయాలు చేయొద్దు

● ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలోని అరికేర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసి రాజకీయాలు చేయడం సరికాదని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తన నివాసమైన రాంపురంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా దాడులు చేయడం సరికాదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం కక్ష సాధింపు కోసం పాల్పడడం బాధాకరమన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను బెదిరించే సంప్రదాయాలను ఎవరూ కూడా ప్రోత్సహించవద్దని, పదవులు శాశ్వతం కాదని తెలిపారు. ఈరన్న కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు. హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని విధాలా అండగా ఉంటాం



విద్యార్థిని కుటుంబానికి నగదు అందజేస్తున్న రఘునాథరెడ్డి

మంత్రాలయం జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రాలయం మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మృతదేహానికి నివాళులర్పించి అనంతరం తల్లిదండ్రులతో బంధువులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మట్టి ఖర్చులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో గూర్మింటి భీమిరెడ్డి, నాగరాజు, నాగేష్, రామాంజనేయులు, ఆంజినేయులు ఉన్నారు.

శ్రీమఠం గోశాలకు విరాళం

మంత్రాలయం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం గోశాలకు చెన్నైకు చెందిన బానుమతి అనే భక్తురాలు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

ఆర్లబండలో సీసీ రోడ్డు పనులు



ఆర్లబండలో సీసీ రోడ్డు పనులు చేపడుతున్న గ్రామ సర్పంచ్ మజ్జిగ మల్లికార్జున

కోసిగి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని, మండల పరిధిలోని ఆర్లబండ గ్రామ సర్పంచ్ మజ్జిగ మల్లికార్జున అన్నారు. శనివారం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శాంభవీ దేవి మఠం వరకు సీసీ రోడ్లు పనులు ప్రారంభించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న వీరయ్య, అయ్యప్ప, చిన్న నరసయ్య, దేవన్న, ఈరన్న, టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జి.అర్చన

కోసిగి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జి.అర్చన అన్నారు. శనివారం కోసిగిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి న్యాయాధికారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ మహిళలందరూ చట్టాలు తెలుసుకుని తమను తాము రక్షించుకోవాలని తెలిపారు. అలాగే మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారి కోసం ఎన్నో కొత్త చట్టాలు తీసుకవచ్చిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. ప్రతి ఇంటికి మహిళ ఆర్థికంగా స్థిరపడినప్పుడే కుటుంబం మంచి ఉన్నత స్థానంలో ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించుకుని సమాజంలో మంచి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రుద్రగౌడు, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, రజక కార్పొరేషన్ చైర్మన్ న్యాయవాది సావిత్రీ, న్యాయవాదులు వెంకటేష్, లోకేశ్ కుమార్, ఎస్ఐ చంద్ర మోహన్, ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్లు ఎస్.నాగలక్ష్మి, భాగ్యలక్ష్మిబాయి, క్యాత్యాయని, అంగన్‌వాడీ టీచర్లు, పొదుపు మహిళలు, ఏపీఎం సత్యమ్మ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జి.అర్చన

ఉప్పర సంఘం అధ్యక్షుడిగా వీరేంద్ర

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఉప్పర (సగర) సంఘం నూతన అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు యూకే వీరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక శ్రీ రామస్వామి దేవాలయంలో మాజీ అధ్యక్షుడు ఏపీ వీరన్న ఆధ్వర్యంలో సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరేంద్రను కులసభ్యులు, అభిమానులు పూలమాలలతో సన్మానించారు. ఉప్పర జాతి పిత భగీరథుడి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు యుకే రాజశేఖర్, యుఎం బల్లెన్న, యుఎం బాలాజి, యు రవి, యుఎం వేణు, వినయ్, శేఖర్, సురేష్, యు జి ప్రకాష్ పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మిగనూరు,జనవరి(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలను గ్రామీణప్రాంతాల్లో ఇంటింటంటికి అందిస్తు కీలకపాత్ర పోషిస్తున్న వీఓఏలకు ఉదోగ్యభద్రత కల్పించాలని వీవోఏల యునియన్ జిల్లా అధ్యక్షులు బసవరాజు ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని యునియన్ కార్యాలయంలో జిల్లా వీఓఏల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 24ఏళ్లనుంచి వెలుగుపథకంలో పనిచేస్తున్న వీవోఏలు గ్రామీణ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తు వస్తున్నారని పేర్కొన్నారు. వీవోఏలను ప్రభుత్వం చిన్నచూపు చూడం సరైంది కాదన్నారు. ముఖ్యంగా గత ఏడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో వీఓఏలను అధికారులు అక్రమంగా తొలగిస్తున్నారని దీన్ని ప్రభుత్వం వెంటనే ఆపాలన్నారు. తొలగించిని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పద్మావతి,మిన్నేశ్వ, మద్దిలేటి, రామలింగప్ప, వరలక్ష్మి, శారదమ్మ, లోక్‌నాథ్ రెడ్డి, తిక్కన్న, రాముడులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మైనుద్దీన్

మంత్రాలయం జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలు బడుల్లో ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్న అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాస్ శిక్షణ కార్యక్రమం ఈవోఆర్డీ ప్రభావతి దేవి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలసలు వెళ్లే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పడం, విద్యార్థుల ఆరోగ్యం, చదువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం వంటివి వివరించాలన్నారు. దీనిపై చేపట్టాల్సిన కార్యక్రమాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేసి ప్రతి విద్యార్థి బడిలో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, భాగ్యలక్ష్మిబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోనెగండ్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ ఏడీ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం గోనెగండ్లలో పశు వైద్యశిబిరాన్ని సర్పంచ్ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు సామూహిక నట్టలనివారణ మందులు వేశారు. అలాగే గొర్రెలు, మేకలు, పెంపకదారులకు నులిపిరుగుల మందులను పంపిణీ చేశారు. గొడ్డు మోత ఉన్న పశువులకు, గర్భకోశంకు సంబంధించిన వ్యాధి ఉన్న పశువులకు చికిత్స చేశారు. పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిజ బృందావనాన్ని దర్శించుకున్న భక్తులు



మంత్రాలయం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు. శనివారం మఠంలో ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం వితరణ రద్దు చేశారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూల రాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు. ఏకాదశిని పురస్కరించుకొని వివిధ రాష్ట్రాలనుంచి వేలాది మందిభక్తులు తరలివచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి

● ఏఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకుల ఆరోపణ

మంత్రాలయం జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీవో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పదవ తరగతి విద్యార్థి అనూష రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని ఏఐఎస్ఎఫ్ మండల కోశాధికారి వీరేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాజులు ఆరోపించారు. రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న సంఘం నాయకులు శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని విద్యానగర్ గ్రామంలోని ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బంద్ చేయించి నిరసన తెలిపారు. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు సరైన బస్సులు లేక ఆటోలో వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

మద్యం, మాంసం విక్రయించరాదు

ఎమ్మిగనూరు రూరల్/ పెద్దకడుబూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు మండలాల్లో మద్యం, మాంసం విక్రయించరాదని ఆయా మండలాల ఎస్ఐలు కె.శ్రీనివాసులు, నిరంజన్‌రెడ్డి సూచించారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వాతంత్ర్య ఉద్యమ నాయకులను స్పూర్తిగా తీసుకోవాలన్నారు. శాంతియుతాన్ని అందరు పాటించాలన్నారు. ఎవరైనా మద్యం, మాంసం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మంత్రాలయం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహల్లి, కల్లుదేవకుంట గ్రామం సమీపంలో శనివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసుల వివరాల మేరకు.. తుంగభద్ర రైల్వేస్టేషన్ నుంచి మంత్రాలయం వస్తున్న కారు చెట్నహల్లి గ్రామం దాటిన తర్వాత పాదయాత్రగా నడుచుకుంటూ వస్తున్న చెన్నైకి చెందిన శాంభవి అనే మహిళా భక్తురాలిని ఢీకొట్టింది. దీంతో ఆ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో కారు డ్రైవర్ సాధిక్‌కు కూడా స్వల్ప గాయాలు కావడంతో రాయచూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కారు నుజ్జునుజ్జయింది. అదేవిధంగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని బెంగళూరు వెళ్తున్న ఓ కారు కల్లుదేవకుంట సమీపంలో అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో పడింది. ఇందులో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.